క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

నరసాపురం: నరసాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని శనివారం జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణిని కలెక్టరేట్‌లో కలిశారు. 216 జాతీయ రహదారి అభివృద్ధి పనుల్లో లోపాలపై ఫిర్యాదు చేశారు. 216 జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న డ్రెయినేజీలను సవ్యంగా నిర్మించకపోవడం, సరైన పద్ధతిలో మరమ్మతులు చేయకపోవడం వల్ల వర్షం పడుతుంటే ఆయా ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని వివరించారు. జాతీయ రహదారి అభివృద్ధి సంస్థతో సంప్రదించి సమస్య పరిష్కరించాలని కోరారు.

టెలి కాలింగ్ ద్వారా ఉచిత హోమియో వైద్యం

యలమంచిలి: పాలకొల్లు పట్టణానికి చెందిన శ్రీరామకృష్ణ పరమహంస హోమియోపతి హాస్పటల్ వైద్యులు డాక్టర్ కోసూరి రామకృష్ణానందరాజు (పోడూరు రాజు) శనివారం టెలి కాలింగ్ ద్వారా ఉచిత హోమియో వైద్య సేవలు అందించారు. ఆసుపత్రి సిబ్బంది దొడ్డిపట్ల బస్టాండ్ సెంటర్లో హోమియో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి వచ్చిన రోగుల బీపీ, సుగర్ పరీక్షలు చేశారు. అనంతరం ఫోన్‌లో వారి ఆరోగ్య ఇబ్బందులను డాక్టర్‌కు చెప్పించారు. డాక్టర్ సిఫారసు మేరకు రోగులకు ఉచితంగా హోమియో పిల్స్ అందజేశారు.

అలరించిన వేంకటేశ్వర గానామృతం

పెనుగొండ: సిద్ధాంతంలో వేంకటేశ్వర స్వామి పద్మావతి కల్యాణ కథా గానామృతం అలరించింది. శనివారం హిందూ ధర్మ పరిరోణ సమితి ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం , ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నందమూరి గ్రామానికి చెందిన సీతారామ భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన గానామృతం భక్తులను అలరించింది. అనంతరం హిందూ ధర్మపరిరక్షణ సమితి అధ్యక్షుడు యక్కల త్రిమూర్తులు, భద్రావతి దంపతులతో వేంకటేశ్వర స్వామి, పద్మావతిల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టవిరుద్ధం

పాలకొల్లు అర్బన్: బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని వాటిని ఎవరూ ప్రోత్సహించకూడదని సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి అన్నారు. పోడూరు మండలం జిన్నూరు గ్రామ సచివాలయంలో శనివారం బాల్య వివాహాల నిరోధ చట్టంపై నిర్వహించిన సమావేశంలో సర్పంచ్ బేబీమహాలక్ష్మి అధ్యక్షత వహించి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి పుచ్చకాయల రవి మాట్లాడుతూ బాల్య వివాహాలను నిరోధించడానికి గ్రామంలో 11 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. బాల్య వివాహం చేసుకున్న వరుడికి రెండు సంవత్సరాల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధిస్తారన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలో ఆశ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ వర్కర్ల ద్వారా ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వో చొప్పల బుజ్జి, స్కూల్ టీచర్ పూడి మెర్సి కమల సుభాషిణి, ఎస్‌హెచ్‌జీ సభ్యురాలు మాత పద్మ, వార్డు సభ్యురాలు రెడ్డి పుష్పావతి, ఏఎన్ఎం ఎ.గౌరీదేవి, యూత్ సభ్యుడు తాడి అన్నాజీ, అంగన్‌వాడీ టీచర్ రావూరి సూర్యకుమారి, మహిళా పోలీసులు దొంగ భవాని, పి.గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

రామలక్ష్మి సేవలు అభినందనీయం

పెనుగొండ: పెనుగొండ సబ్ ట్రెజరీ అధికారి ఎస్‌వీవీఎస్‌వీ రామలక్ష్మి సేవలు అభినందనీయమని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి అన్నారు. శనివారం ఎస్టీవో రామలక్ష్మి పదవీ విరమణ సందర్భంగా జరిగిన అభినందన సభలో రామలక్ష్మిని ఘనంగా సత్కరించారు. విధులు నిర్వహిస్తూ ఉద్యోగులకు, పంచాయతీలకు ఎనలేని సహకారం అందించారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి టి రత్నాకరరావు, ఎస్టీఓ సిబ్బంది పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

నా క్లయింటు అయిన పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం మున్సిపల్ ఏరియాలోని బాలచంద్ర మౌళీశ్వర స్వామి వీధి డోర్ నెంబర్ 10-3-14/1 కాపురస్తులు సమతం బాలచంద్ర మౌళీశ్వర స్వామి గారి భార్య సమతం బాలనాగ మీనాక్షి గారు నాకు ఇచ్చిన సంజాయిషీ పై మీకు తెలియజేయునది ఏమనగా నా క్లయింటు ది 14 -12-2023 సంవత్సరం తేదీన పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మున్సిపల్ ఏరియా అవ్వారి కామయ్య గారి వీధి డోర్ నెంబర్ 9-4-3/5 కాపురస్తుడు పిల్లా సతీష్ గారి భార్య పిల్లా సూర్య కుమారి వద్దనుండి డాక్యుమెంట్ నెంబర్ 79 56/2023 ద్వారా ఈ క్రింది ఉదహరించిన షెడ్యూల్ ఆస్తిని క్రయ దస్తావేజు ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకుని సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములతో అనుభవించుచున్నారు. సదరు ఆస్తిని శ్రీమతి పిల్లా సూర్యకుమారి గారు ది 5-10-2019 వ తేదీన డాక్యుమెంట్ నెంబర్ 55 79/2019 ద్వారా శ్రీమతి ముద్దాల కనకమ్మ వగైరాల వల్ల క్రయం పొందియున్నారు. సదరాస్తి ముద్దాల కనకమ్మ వారి కుటుంబ సభ్యుల యొక్క పూర్వార్జితం బాపతి ఆస్తి అయి ఉన్నది. కావున సదరు షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనా ఎట్టి విధములైన హక్కులు గాని, అభ్యంతరములు గాని ఉన్న ఎడల 15 రోజుల లోపుగా నన్ను గాని, నా క్లయింటు ను గాని స్వయంగా కలిసి వారి యొక్క ఆక్షేపణలు తెలియజేయవలసిందిగా కోరుచున్నాను.

షెడ్యూల్ ఆస్తిపై వివరము

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం నరసాపురం సబ్ రిజిస్టర్ వారి ఆఫీసులో చేరిన నర్సాపురం ఏరియా పాత 20వ వార్డు, ప్రస్తుతం 23వ వార్డు (రుస్తుంబాద తాలుకు) జిరాయితీ మేరక రి.స.నెం 613/6 పుదా య 3.30 ట్లు లో య 80 ట్లులో రెవెన్యూ అడంగల్ ప్రకారం రి.స.నెం.613 /6 బి1రు,యం 0.23 ట్లులో డోర్ నెంబర్ 15-1-41/9 గల ఇంటికి చేరువలో గల ఖాళీ స్థలము చ.గ 163.54 లకు హద్దులు కొలతలు వివరము: తూర్పు: మాదాసు తిరుమల గిరి వాసు గారి స్థలము ఆ 4.3.04లు. దక్షిణం: గుబ్బల గంగాధరం తాలూకు ఆ 9.00 లు వెడల్పు గల దారి మార్గము 34.00 లు. పడమర: ముద్దాల కుమార్ గారి స్థలము ఆ 43.03 లు. ఉత్తరం: ఆ 9.00 లు వెడల్పు గల ఉమ్మడి దారి మార్గము ఆ 34.00 లు

మూరిశెట్టి వెంకటేశ్వర్లు
అడ్వకేట్, భీమవరం-534 201
సెల్ నెంబర్:98481 55579

భీమవరం
31-8-2024


నరసాపురం: పొన్నపల్లిలో ఓవీధిలో వర్షపునీటితో మునిగిన రోడ్డు


నరసాపురం: 5వ వార్డులో వర్షపునీటితో మునిగిన రోడ్డు


పాలకొల్లు సెంట్రల్: స్వచ్ఛందంగా డ్రెయినేజీని శుభ్రం చేసుకుంటున్న పెదపేట స్థానికులు


పాలకొల్లు సెంట్రల్: మార్కెట్ యార్డ్ వద్ద డ్రెయినేజీ, రోడ్డు ఏకమై పారుతున్న వర్షం నీరు

దంచికొట్టిన వర్షం

జనజీవనం అస్తవ్యస్తం

నరసాపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం నరసాపురం తీరప్రాంతంపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకూ ఏకధాటిగా వర్షం దంచి కొట్టింది. భారీ వర్షంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. పట్టణంలో డ్రెయిన్స్ పొంగిపొర్లాయి. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టణంలోని స్టేషన్‌పేట, నందమూరి కాలనీ, జవదాలపేట, పొన్నపల్లి ప్రాంతాలు నీటమునిగాయి. పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో కూడా రోడ్లు జలమయమయ్యాయి. శనివారం విద్యాసంస్థలకు సెలవు ఇచ్చారు. అధికారులు మత్స్యకారులను వేటకు వెళ్లకూడదని హెచ్చరికలు జారీ చేశారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మారడంతో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు 12.4 మిల్లీ మీటర్లు, శుక్రవారం నుంచి శనివారం ఉదయం వరకు సుమారు 84.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. దీంతో మండలంలోని పలు గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు నీట మునిగడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మొగల్తూరు గ్రామంలోని పెద్ద గొల్లగూడెం, స్టేషన్ రోడ్, కోటరోడ్, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రహదారిల్లో నీరు నిలిచిపోయింది. మొగల్తూరు మండలం కాళీపట్నంలోని జాతీయ రహదారిపైకి వర్షపు నీరు చేరడంతో వాహనదారులతో పాటు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. మొగల్తూరు పంచాయతీలోని ఇంజేటివారిపాలెం, నక్కావారిపాలెం, పాలకమ్మచెరువు,రామన్నపాలెం పంచాయతీలో చేలు నీటమునిగాయి. భారీ వర్షాలు కారణంగా అధికారుల ఆదేశాల మేరకు మొగల్తూరు రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సమస్యలపై ప్రజలు 92915 39408 నెంబర్‌కు ఫోన్ చేయాలని తహసీల్దార్ విద్యాపతి సూచించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలు నీటమునుగుతున్నాయి. పట్టణంలో ఇటీవల బస్టాండ్ సెంటర్ వద్ద సిల్ట్ తీయడంతో కొంతవరకూ మెరుగు పడడంతో వర్షం నీరు నెమ్మదిగా లాగుతుంది. అలాగే పట్టణంలో లజపతిరాయ్‌పేట, హౌసింగ్‌బోర్డు కాలనీ, సుబ్బారాయుడు గుడి వద్ద కల్పనా వీధి, బెత్లహంపేట, పెదపేట, బంగారువారి చెరువు గట్టు, చిత్రావి చెరువు గట్టు ఓల్డ్ బ్యాంక్ కాలనీ, బ్రాడీపేట ఇలా పల్లంగా ఉన్న అనేక ప్రాంతాలు వర్షం నీటితో మునిగిపోయాయి. రాత్రి నుంచి వర్షం ఎడతెరిపి లేకుండా శనివారం మధ్యాహ్నం 12 గంటల వరకూ ఏకధాటిగా కురుస్తూనే ఉంది. కొన్ని ప్రాంతాల్లో జనం ఇంటిలో నుంచి బయటకు రాలేని పరిస్థితి ఉంది. అలాగే ద్విచక్ర వాహనదారులు కొన్ని ప్రాంతాల్లో తమ వాహనాలు బయటకు తీయలేని పరిస్థితి ఉంది.

భారీ వర్షాల కారణంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో విద్యా సంస్థలు సెలవు ప్రకటించడంతో విద్యార్థులను ఇళ్లకు పంపించారు. స్థానిక 16వ వార్డు పెదపేటలో మోకాలు లోతులో వర్షం నీరు నిలిచిపోవడంతో ఆ ప్రాంతంలో ప్రజలు రాకపోకలు లేక స్థంబించి పోయాయి. ఆ ప్రాంతంలో నిర్మాణం జరుగుతున్న ఓ అపార్ట్‌మెంట్ వల్ల డ్రెయినేజీ పూడిపోవడంతో నీరు సరిగ్గా వెళ్లడంలేదని పెదపేట స్థానికులు స్వయంగా డ్రెయినేజీలో అడ్డుపడిన చెత్తను తొలగించుకున్నారు. మునిసిపల్ కమిషనర్ విజయసారధి పట్టణంలోని పల్లపు ప్రాంతాలను పరిశీలించారు.

పెనుగొండలో..

పెనుగొండ: ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షంతో జనజీవనం స్తంభించింది. రహదారులు ఛిద్రంగా మారాయి. ఆచంట నియోజకవర్గంలో శుక్రవారం నుంచి శనివారం సాయంత్రం వరకూ వర్షం పడుతూనే ఉంది. దీంతో ప్రజలు నానావస్థలు పడ్డారు. ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు మండలాల్లోని కాలనీల్లో రహదారులు వర్షపు నీటితో నిండిపోయాయి. కోడి పందెల దిబ్బలో రహదారులు బురదమయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు, పెనుగొండ మండలం రామన్నపాలెం, పెనుమంట్ర మండలం మార్టేరు నుంచి జగన్నాథపురం వరకూ రహదారి, ఆచంట మండంలోని పలు రహదారులు పూర్తిగా గోతులమయంగా మారాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో నక్కడ్రెయిన్ పొంగుతుందేమోనని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.


మొగల్తూరు: పేరుపాలెంలో ఎగిసిపడుతున్న సముద్రపు అలలు

నిండా ముంచిన వాన

నరసాపురం రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాలు, పల్లపు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. గత రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో నరసాపురం మండలంలోని అన్న గ్రామాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికల నేపథ్యంలో రైతాంగం మరింతా ఆందోళనగా ఉన్నారు. ఇదిలా ఉంటే శనివారం ముంపు ప్రాంతాల్లో ఆర్డీఓ అంబరీష్, తహసీల్దార్ రాజరాజేశ్వరి పర్యటించారు. లక్ష్మణేశ్వరంలో జోనానగర్ ప్రాంతంలో ఓ ఇంటి గోడ కూలింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని తహసీల్దార్ కోరారు.


నరసాపురం రూరల్: లాకుపేటవద్ద నీట మునిగిన పల్లపు ప్రాంతాలను పరిశీలిస్తున్న అధికారులు


పెనుగొండ: సిద్ధాంతం కాలనీలో నిలిచిన వర్షపు నీరు


పెనుగొండ: రామన్నపాలెం వద్ద రహదారి దుస్థితి


నరసాపురం రూరల్: సరిపల్లిలో నీట మునిగిన పంట పొలాలు

ప్రశాంతంగా పింఛన్ల పంపిణీ

మొగల్తూరు: మండలంలో సుమారు 90 శాతం పింఛన్‌ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ వి.బాబ్జిరాజు శనివారం తెలిపారు. మండలంలోని 17 గ్రామాలకు సంబంధించి 10,693 పెన్షన్‌లకు గాను 9,206 మంది లబ్ధిదారులకు పింఛన్ అందించారన్నారు. పింఛన్ తీసుకోని వారికి సోమవారం అందిస్తామని స్పష్టం చేశారు.

ఆచంటలో..

పెనుగొండ: ఆచంట మండలంలో పింఛన్ పంపిణీని శనివారం ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎమ్మెల్యే పితాని తనయుడు వెంకట్‌లు వల్లూరులో ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహప్రసాద్, కేతా మీరయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెనుగొండ మండలంలో

పెనుగొండ మండలంలో శనివారం సాయంత్రానికి 8200 మందికి ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను అందించినట్లు ఎంపీడీవో ఎస్.శ్రీనివాస్ దొర ఓ ప్రకటనలో తెలిపారు. 8814 మందికి గాను, 8200 మందికి అంటే 93 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. మరో 614 మందికి పంపిణీ చేయాల్సి ఉందని తెలిపారు.


పెనుమదంలో పింఛన్ అందజేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: పోడూరు మండంలోని పెనుమదం గ్రామంలో శనివారం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. అనంతరం పట్టణంలోని బ్రాడీపేటలో నూతనంగా నిర్మించిన మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ నందమూరి తారకరామారావు నూతన విగ్రహాన్ని రామానాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్ఎం ఫాజిల్, ఎంపీడీఓ డి.సుహాసిని, సర్పంచ్ తానేటి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కుట్టుమెషీన్ శిక్షణ

యలమంచిలి: విద్య, వైద్యం, సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు మహిళల ఉపాధి అవకాశాలు కల్పించడానికి బైర్రాజు ఫౌండేషన్ ప్రాధాన్యత ఇస్తుందని బైర్రాజు ఫౌండేషన్ మట్లపాలెం శాఖ కన్వీనర్ పేరిచర్ల రవివర్మ చెప్పారు. మట్లపాలెంలో గత రెండు నెలలుగా 30 మంది మహిళలకు కుట్టుమెషీన్ కుట్టడంలో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలందరికీ స్థానిక ద్వాక్రా భవనంలో శనివారం రవివర్మ, గ్రామ పెద్దలు సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవివర్మ మాట్లాడుతూ బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది మట్లపాలెం గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కుట్టు మెషీన్ శిక్షణకు మరింత మహిళలు ముందుకు వస్తున్నారని, రెండో విడత శిక్షణకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ముందు వరుసలో శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో ఆర్థికంగా ఇబ్బంది ఉన్న మహిళలను గుర్తించి వారికి ఉచితంగా కుట్టు మెషీన్స్ ఇస్తామని రవివర్మ చెప్పారు. కార్యక్రమంలో మట్లపాలెం మాజీ సర్పంచ్ చల్లా విశ్వేశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు పేరిచర్ల సత్యవతి, మాస్టర్ ట్రైనీ కాకర్ల పుష్పవతి తదితరులు పాల్గొన్నారు.


కుట్టుమెషీన్ నేర్చుకున్న మహిళలకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న బైర్రాజు ఫౌండేషన్ సభ్యులు

అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు

- నాడు ప్రతిపక్షంలో విద్యుత్ కోతలపై నిమ్మల నిరసనలు
- అడవిపాలెం సబ్‌స్టేషన్‌లో రాత్రి బసతో నిరసన
- నేడు మంత్రి హోదాలో ఉన్నా ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్న ప్రజలు

పాలకొల్లు సెంట్రల్: నియోజకవర్గంలో విద్యుత్ కోతలతో ప్రజలు విసుగెత్తిపోతున్నారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయం తేడా లేకుండా విద్యుత్ కోతలు విధించడం వల్ల ప్రజల్లో అసహనం పెరిగిపోతుంది. ప్రజాప్రతినిధులకు ప్రతిపక్షంలో ఉంటేనే ప్రజా సమస్యలు గుర్తుకు వస్తాయా? అధికార పక్షంలో ఉంటే ప్రజా సమస్యలు గుర్తుకు రావా? అంటూ నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలల నుంచి నియోజకవర్గంలో విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయి. దీనిపై విద్యుత్ శాఖ అధికారులను ప్రశ్నిస్తే సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ మరమ్మతులు, నరసాపురం నుండి వచ్చే 33 కేవీ లైన్లు మరమ్మతులు, సబ్‌స్టేషన్లో మరమ్మతులు, ట్రీ కటింగ్‌లు అంటారు. ఇలా వేసవి కాలం లేదు.. వర్షాకాలం లేదు విద్యుత్ కటింగ్‌లతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇన్వెటర్ ఉన్నా చార్జింగ్ అయిపోతున్నాయని, జనరేటర్లపైనే ఎక్కువగా ఆధారపడవలసి వస్తుందని చెబుతున్నారు. వివాహాది శుభకార్యాలకు ఆర్థికంగా స్థితిమంతులైతే జనరేటర్లు పెట్టించుకుంటారని ఆ స్థోమత లేనివాళ్లు చీకట్లోనే వేడుకలు నిర్వహించుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. మంత్రి నియోజకవర్గమైనా విద్యుత్ కోతలు పెరిగాయే తప్ప తగ్గడంలేదని ప్రజలు వాపోతున్నారు.


అడవిపాలెం సబ్‌స్టేషన్‌లో విద్యుత్ కోతలంటూ కరెంట్ ఉన్నా నిరసన తెలుపుతున్న నిమ్మల రామానాయుడు (ఫైల్)

అప్పట్లో పెద్ద డ్రామా

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు కరంటు కోతలు అంటూ ఏకంగా దీక్షలే చేపట్టేవారు. నాడు ప్రతిపక్షంలో ఉన్న నేటి మంత్రి నిమ్మల రామానాయుడు అడవిపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద 2023 మే 19 రాత్రి విద్యుత్ కోతలకు నిరసన అంటూ మడతమంచం వేసుకుని రాత్రి అంతా పడుకుని నిరసన తెలిపారు. ఇంట్లో పడుకుంటే ఉక్కబోత-బయట పడుకుంటే దోమల మోత అంటూ దీక్ష పేరుతో డ్రామాను రక్తికట్టించారు. ఓ ప్రతిపక్ష ప్రజాప్రతినిధిగా నాడు ప్రజల పక్షాన పోరాటం చేస్తూ మడతమంచం వేసుకుని దోమలు కుట్టకుండా దోమతెర ఏర్పాటు చేసుకుని అక్కడ విద్యుత్ సరఫరా ఉన్నా లాంతర్లు ఏర్పాటు చేసుకుని మరీ నిరసన తెలిపారు. ఆ దీక్ష వద్ద ఎల్‌ఈడి ల్యాంప్‌లతో పెద్ద ఫోకస్ లైట్ స్తంభం వెలుగుతూ ఉన్నా చీకటి ప్రాంతాన్ని వెతుక్కుని అక్కడ మంచం ఏర్పాటు చేసుకున్నారు. ఆయన అనుచరులు మాత్రం చీకటిగా ఉన్నట్లు సెల్‌ఫోన్ వెలుతురులో దీన్ని వీడియోలు తీసి ఎలక్ట్రానిక్, ప్రింట్, సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు.

మంత్రి అయినా కోతల మోత

ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో జలవనరుల శాఖ మంత్రిగా నిమ్మల రామానాయుడు ఉన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే గతంలో కంటే ఎక్కువ కరెంట్ కోతలు ఉంటున్నాయని ప్రజలు వాపోతున్నారు. ప్రతిపక్షంలో ఉంటేనే ప్రజా సమస్యలు కనిపిస్తాయా? అధికారంలో ఉంటే ప్రజా సమస్యలు కనిపించవా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మంత్రి రామానాయుడు, విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ కోతల నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు వేడుకుంటున్నారు.


ఓ వివాహ వేడుక పందిరిలో కారు లైట్ల వెలుతురుతోనే సరి


విద్యుత్ కోతలతో జనరేటర్ వెలుతురులో గృహాలు


మంత్రి నివాసం పరిధిలో విద్యుత్ కోతలు